కథానిక

# ఋణానుబంధం!

యం. వై. రెడ్డి

"రావోయ్, పోలిరెడ్డీ! రా రా! కూర్చో"అని ఆహ్వానించాడు అప్పటికే రచ్చబండమీద బైఠాయించి ఉన్న నారయ్య. "ఏమోయ్! ఎప్పుడు ప్రయాణం? లోన్ (Loan) డబ్బు యెప్పుడు తెస్తావోయ్?"అని నారయ్యే, ప్రసంగం ఆరంభించాడు. "రేపు ఖజానాకు పోయి డబ్బు తెచ్చుకోవాల మామా!" అని అమాయకుడైన పోలిరెడ్డి సమాధానం. "అదికాదోయ్! పోయేటప్పుడు మరీ ఇరవై రూపాయలు పట్టుకుపో"అంటూ అనుభవజ్ఞుడైన నారయ్య సలహా యిచ్చాడు. "ఎందుకూ?"అని వెంటనే అప్రయత్నంగా, అమాయకంగా అనేశాడు పోలిరెడ్డి. తనకేం తెలుసు, అక్కడ జరిగే తతంగమంతా!

* * *

"లోన్సు డబ్బు యిచ్చేది యెక్కడ బాబూ?" తనదగ్గిరగాపోతూన్న జవానును పట్టుకొని అడిగాడు పోలిరెడ్డి, ఏమీతోచక. జవాను ముఖంలో ఉన్న చీదరంతా పోయింది. డబ్బువచ్చే సూచనలున్నట్లుగా కండ్లు మిటకరించాడు. బంధుప్రీతితో పోలిరెడ్డివంక చూచాడు. "ఎన్నాళ్ళయింది దరఖాస్తు పెట్టి?"విచారణ సాగించాడు జవాను. "అయిదు రోజులయింది బాబూ!"ప్రశ్నకు జవాబు. "ఇప్పుడు యెట్లా వొస్తుందోయ్? ఊద్దరగా వొస్తుందనుకున్నావా ఏం? ముందు గుమాస్తాదగ్గిరకెళ్ళి నీ దరఖాస్తు సంగతి కనుక్కో"అంటూనే ఇంకోపక్క నిర్లక్ష్యంగా చూడటం మొదలెట్టాడు. "ఇంతపెద్ద తాలూకాఫీసులో యే గుమాస్తా నడగాలి?" అనే ఆలోచనలోపడ్డాడు పోలిరెడ్డి. అంతా అగమ్యగోచరం! "బాబ్బాబు! మీరే చూపించండి, నాకేం తెలియదు"అని బ్రతిమాలాడు పోలిరెడ్డి ఆఫీసరు పోజుపెట్టిఉన్న జవానును. "ఉండవయ్యా! నీదొక పెద్ద గొడవ తయారయింది. గొంతు ఆర్చుకుపోతూందే! కాఫీనీళ్ళకు ఓ పావలా దయచెయ్యరాదూ? తెగచంపుకు తినకుంటే!" ప్రశ్నమార్కు ముఖంపెట్టాడు మహా కాఫీత్రాగేవాడిలాగ. లో జేబులోనుండి పావలా జవానుచేతిలోపడింది.

* * *

తాను వ్రాసుకుంటూ ఉన్న కాగితాలనుంచి గుమాస్తా తలయెత్తాడు. ఎదురుగా పోలిరెడ్డి. "మంచి గిరాకీ!" తలదించుకున్నాడు. అలాగే వ్రాసుకుపోతున్నాడు. గంట, రెండుగంటలసేపు నిలబడ్డాడు పలుకరిస్తాడనే ఆశతో పోలిరెడ్డి. పోలిరెడ్డి ఆఖరుకు తెగించి, భయపడుతూ భయపడుతూ పిలిచాడు, "సార్! నా లోన్ దరఖాస్తు సంగతి..." గుమాస్తా తల ఎత్తాడు. "ఏవూరు మీది? ఎప్పుడు పెట్టావు దరఖాస్తు? నీ పేరేం?" ప్రశ్నలవర్షం కురిపించాడు గుమాస్తా క్రాస్ ఎక్జామిన్ చేసే న్యాయవాదిలా. పోలిరెడ్డి చేతులుకట్టుకుని మరీ సమాధానమిచ్చాడు. "అదికాదయ్యా! అందరూ ఇలాగ మా ప్రాణాలమీదపడితే ఎలా చస్తాం? బోలెడన్ని దరఖాస్తులొచ్చాయ్! ఏసంవత్సరానికో ఇస్తారులే నీకు"అని అంటూనే మరల కాగితాల మీద కుస్తీ ఆరంభించాడు. "ఇలా రా!" మొదటి జవాను పిలుపు.

"అది కాదయ్యా! ఇంతమంది పెట్టినప్పుడు నీకెట్లా ఇస్తారనుకున్నావ్? ఏదో కాస్త ఆయనకు ముట్టచెప్పు!" పరులక్షేమమే పరమార్థంగా పెట్టుకున్న జవాను సలహా ఇచ్చాడు! మరల గుమాస్తా దగ్గిర ప్రత్యక్షమయ్యాడు పోలిరెడ్డి—ఇంతటితోపీడ విరగడైపోతుందని, డబ్బు వస్తుందనే సంతోషంతో.

బయటికి దారితీసి, ఓమూలకు పిలుచుకుపోయాడు గుమాస్తా. "ఏం?" అన్నాడు అధికారి స్వరంతో పావలా మాత్రం తీసాడు పోలిరెడ్డి. "ఏం? అడుక్కునేవాళ్ళ మనుకున్నావా? ఏం? దానధర్మం ఇచ్చినట్లు ఇస్తావ్? ఇప్పుడే తాసిల్దారు దగ్గరికి పంపించి, సంతకం చేయించి, రెండుమూడు రోజుల్లో డబ్బు వొచ్చేట్లు చేస్తా ఏదో పది రూపాయలన్నా ఇవ్వకపోతే, ఎలా? అంతకష్ట

మైన పని!" పోలిరెడ్డి అయిదు రూపాయల నోటు గుమాస్తా చేతిలో పెట్టడము, ఆయన ముఖంమీద చిరునవ్వు తాండవించటం ఒకే క్షణంలో సంభవించాయి. "సరేగాని, రేపు తాసిల్దారు మీ ఊరికి క్యాంపు వెళాడు నేను, దొరవారూ రేపువస్తాం. కోళ్ళను, గిత్తను కోయించి కాస్త సిద్ధంచేయించు, మరీ శాంక్షన్ అయిపోతుంది." "సరే" అని, బుర్రగోక్కుంటూ, తనఊరికి ప్రయాణమయ్యాడు అమాయిక పోలిరెడ్డి, లంచగొండి తనాన్ని తలకు కుంటూ.

* * *

త్రేన్చుకుంటూ, కూర్చున్నారు తాసిల్దారు, "లోన్సు" గుమాస్తా. "గ్రామరెడ్డి ఏవయ్యా?" తాసిల్దారు గర్జింపువిని గ్రామరెడ్డి చేతులు కట్టుకొని వచ్చి "సార్" అంటూ నిలబడ్డాడు. మొట్ట మొదట తీసుకున్న దరఖాస్తు పోలిరెడ్డిది! "పోలిరెడ్డికి భూమీ, గట్రా ఉన్నాయా?" విచారణ ప్రారంభించాడు తహసిల్దారు. "ఉన్నాయ్, సార్!" అన్నాడు గ్రామరెడ్డి అప్పుడే పోలిరెడ్డి దగ్గర చాటుగా తీసికొన్న పది రూపాయలను తలుచుకుంటూ. విచారణ అయిపోయింది.

పోలిరెడ్డి దగ్గరకు చేరాడు నవ్వుతూ గుమాస్తా "ఏమోయ్! మీకు పాడి చాల ఉన్నట్లుందే" దేనికో ప్లాన్ వేస్తూన్న గుమాస్తా అన్నాడు. "ఏదో, మీదయవల్ల" ఏంచెప్తే, ఏంకొంప మునుగుతుందో ననుకుంటూన్న పోలిరెడ్డి. "సరేగాని, నెయ్యికి చాల కష్టంగా ఉంది. ఏదో నువ్వు మళ్ళీ నాలుగు రోజులుల ఆఫీసుకు రావాలసి ఉండె నాయె. వచ్చేప్పుడు కాస్త రెండు శేర్ల నెయ్యి పట్టుకురా! మరిచా. నాలుగు శేర్లసజ్జలుకూడ..." అన్నాడు అభ్యర్థనతో మిళితమైన అధికార స్వరంతో. పోలిరెడ్డికి, గుండెల్లో రాయిపడింది, ఏదో మాట వరుసకలా అన్నాడేగాని, నిజంగా అతనికి పాడిలేదు. ఏంచేస్తాడు మరి!

* * *

మళ్ళీ ఆఫీసులో మన దరఖాస్తుదారు హాజర్. ద్వారానికి దగ్గరగా నెయ్యిముంత, సజ్జలమూట పెట్టి నిలబడ్డాడు పోలిరెడ్డి. పోలిరెడ్డిని చూచిన వెంటనే మన గుమాస్తా ముఖముమీద ఒక ఆశా రేఖ క్షణంపాటు మెరిసి, అంతలో అదృశ్యమయింది, కారణం పోలిరెడ్డి చేతిలో యేమీలేక పోవటమే! మరుక్షణంలో తిరిగి ముఖం విప్పారింది. కారణం తెలిసిందేగా! తానాశించిన సరుకు లగుపడటమే. "తాసిల్దారు సంతకం చేసినాడు. నేను చేయవలసిన పనిఅయిపోయింది. నీ దరఖాస్తు తాసిల్దారు మీ ఫర్కా రెవిన్యూఇనస్పెక్టర్ దగ్గరికి పంపించాడు. అక్కడకుపోయి తిప్పలుపడు" అంటూ తన కాగితాలమీద ఒరిగాడు తనమీద పడ్డ మహా కార్యభారాన్ని పూర్తిచేసినట్లు!

* * *

ఏకాగ్ర చిత్తంతో పనిచేసుకుంటున్నట్లున్న రెవెన్యూ ఇనస్పెక్టరును సమీపించాడు పోలిరెడ్డి. వాకిట్లో అడుగు పెట్టేటప్పటికి యమదూతలా జవాను అడ్డంవచ్చి నిలబడ్డాడు. యమకింకరుని చేతిలో పావలా పడింది. ఆటంకం కాస్తా తొలగి పోయింది. ఇనస్పెక్టరుదగ్గరికిపోయి తనగోడవంతా చెప్పుకున్నాడు. "నీ దరఖాస్తు చూశానుగాని, తాసిల్దారు, క్లార్కు, వాళ్ళ ఇష్టమొచ్చినట్లు రాసినారోయ్! నేను చెయ్యటాని కేంలేదు" ఆ మాట ఆయన నోట్లోంచి ఊడి పడుతుందనుకుంటూనే ఉన్న పోలిరెడ్డి తనదగ్గర ఉన్న పన్నెండు రూపాయలలోని పదిరూపాయలను ఆయన చేతిలో పెట్టాడు. "అబ్బెబ్బే! అంటూనే, ఆ పని చాలా నీచమైనట్లు తనకు తెలుసునన్నట్లు, కాని పోలిరెడ్డి అంతటి మంచివానికి ఉపకారంచేయటానికి తీసికోక తప్పటంలేదన్నట్లు, మొగమోటపు ముఖంతో దానిని తన జేబులోనికి జారవిడిచాడు.

అంతటిలో ఊరుకున్నాడా, ఏమన్నానా! "అదికాదు. తాసిల్దారు బలే చెడ్డవాడు వచ్చేడు. వాడు శుద్ధ లంచగొండి అయ్యాడు. వానికి కొంత ముట్టచెప్పాలి. కనీసం పదిరూపాయలైనా..." మహా ఆ డబ్బు తాసీల్దారు కిచ్చేవాడిలా! చివరకు జవానుతో మాట్లాడేటప్పుడుకూడా తాసీల్దారును దొరవారు అని సంబోధించే ఈయన, ఆయనను 'వాడు' అనటం పోలిరెడ్డికి ఆశ్చర్యం కలిగించింది. "ఇప్పుడు లేదుబాబూ" అని చెప్పేడు. "ఇప్పుడు లేకున్నా ఫరవాలేదులే. ఎల్లుండి మీ వూరికి రావలసిన పని ఉంది. అప్పుడిద్దువుగానిలే" దయ తలుస్తున్నట్లుంది ఆ ధోరణి.

పోలిరెడ్డికి కళ్లు తిరుగుతున్నాయ్. "గవర్నమెంటువాళ్లు ధర్మాత్ములై యిస్తుంటే, ఈ నిక్షేపరాయుళ్ళంతా కలిసి ఇలా చేస్తారేం? ఏం న్యాయం? కిష్టయ్యశెట్టి మేలే! వడ్డీ నూటికి నెలకు రూపాయ తీసికున్నా. ఇంతవరకు వచ్చినతరువాత ఇప్పుడు వెనుదీస్తే లాభమేం? మొన్న బాకీతెచ్చిన వంద రూపాయలలో, యాభై రూపాయలు ప్రయాణ ఖర్చులకు, మిగతా దానధర్మాలకు ఖర్చాయె. చూస్తే ఈ యాభైరూపాయలుకూడా ఖర్చు అయేటట్లున్నాయ్ కానీ, ఏంచేస్తాం? ఆ భగవంతుడేఉన్నాడు! అనుకున్నాడు పోలిరెడ్డి.

*   *   *

వారం రోజులు గిరగిర తిరిగాయ్. పోలిరెడ్డి విగ్రహం తాలూకాఫీసు వరండాలో ప్రత్యక్షమయింది. భగవానుడు తనకెదురుగా వచ్చినప్పుడు భక్తుని మనస్సెలా ఉంటుందో, అలాంటి మనస్సుతో గుమాస్తా బయటికి వచ్చాడు. "అబ్బ! ఆఖరకు నీ పని అంతా పూర్తిచేశాం. ఎంతకష్టం? ఇంతకూ నీ దరఖాస్తు మళ్ళీ నా దగ్గరకు వచ్చింది. సిరస్దారు దగ్గరికి పంపాలి. బహుమానం ఏమన్నా..." సాగదీసాడు గుమాస్తా. విసుక్కుంటూ రూపాయ చేతిలోపెట్టాడు పోలిరెడ్డి. "ఇదిగో చూడు సిరస్దారు ఊరకే సంతకంపెట్టడు. ఆయనకు ఓ ఐదైనా ముట్టచెప్పాలి" జలగలగా పట్టుకున్న ఆ గుమాస్తా చేతికి మరల అయిదు రూపాయలు అందాయి. "అమ్మయ్యా!"అని ఒక పెద్ద నిట్టూర్పు విడిచాడు పోలిరెడ్డి. సిరస్తాదారు కివ్వవలసిన అయిదు రూపాయలు గుమాస్తా చేతిలోనే ఉండి పోయాయ్!

నలగని కొత్తనోట్లు లెక్కపెట్టుకొని, 500 రూపాయలు సరిగా ఉన్నవి, లేనివి మళ్లీ ఎంచుకుని సంతోషంతో బయటికి వచ్చాడు. అంతలో గుమాస్తాల దండు మిడతలదండుమాదిరి ప్రత్యక్షం! "బలే లాట్ కొట్టావయ్యా! చాలా కష్టపడి నీపని చేశాం! నీపేరు చెప్పుకుని టీపార్టీ చేసుకుంటాం!" అప్పటికీ వదలని ఆ మిడతలదండుకు రెండు రూపాయలు ఇచ్చి బయద్దేరాడు. అయితే ఇంతకు దీని కోసం ఖర్చయిందెంత?

---

# అనుశ్రుతి

మసూనా

ఆకాశము, చందమామ
కలంకరణ మందువా?
జాబిలియే అంబరాన
శోభకూర్చె నందువా?

సంధ్యారాగము పృథ్విని
స్వాధీనపతికన్ చేసెనా?
అవనీ సుందరి రాగమె
సంజకు కెంపిచ్చెనా?

నీలోత్పలి ప్రేమ. తేటి
నెనరుకు అవశ్యకమా?
భ్రమరిరాక నీలోత్పలి
విరిసిమురియ కారణమా?

కోయిల పాటలకోసము
వసంతుడె వచ్చునా?
వాసంతుని నెస్తముకై
కోకిల మరుదెంచునా?–

మహాకవుల కవిత, జనత
ప్రగతికి ఆధారమా?
జనసంఘపు జీవచరిత
సత్కవితకు జీవమా?-

అనునిత్యం అనంతగతి
కాంతినొందు సుకృతి
అపూర్వాను బంధమ్ముల
అలరుచుండు ప్రకృతి–